# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శనివారం | 23 మార్చి, 2024 | పేజీలు : 05


**ప్రజా పక్షం/పెద్దపల్లి టౌన్ :** పెద్దపల్లి ఎస్సీ రిజర్వుడు పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా గడ్డం వంశీకృష్ణకు టికెట్ కేటాయించడం పట్ల సీఎం రేవంత్ రెడ్డికి చెన్నూర్, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు వివేక్, వినోద్, వంశీ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నాగర్ కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి, పెద్దపల్లి కాంగ్రెస్ నాయకులు వునుకొండ శ్రీధర్ పటేల్, తదితరులు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



## సీఎం రేవంత్‌ను కలిసిన వివేక్, వంశీకి టికెట్ కేటాయింపుపై కృతజ్ఞతలు

# యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

### అధికారుల, ప్రజా ప్రతినిధుల అండదండలతోనే

**ప్రజాపక్షం/దహేగాం/పెంచికల్ పేట్ :** ఇసుక అక్రమ రవాణా ఇష్టారీతిగా జరుగుతుంది. ఇసుక అక్రమ రవాణా ఇష్టారాజ్యంగా జరుగుతున్న సంబంధిత అధికారులు అటువైపుగా కూడ చూడడం లేదు. అనుమతులు లేకుండా కొందరు.. అనుమతుల పేరుతో మరికొందరు.. పట్టపగలే దోచుకుపోయేది ఇంకొందరు.. రాత్రివేళల్లో దొంగతనంగా దోచుకెళ్లేవారు మరెందరో. మార్గాలు ఏవైనా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్ పేట్, దహేగాం, కాగజ్ నగర్ మండలాల్లో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఇసుక కనిపిస్తే చాలు మండల సరిహద్దులు దాటిస్తున్నారు. అధికారులు కూడా చూసిచూడనట్లు వ్యవహరించడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ఈ మూడు మండలాలలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటం లేదు. డోజర్లతో టిప్పర్లు, ట్రాక్టర్లతో వాగుల్లోని ఇసుకను తరలించి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. మరోవైపు జనానికి మాత్రం చుట్టూ ఇసుక ఉన్నా సహేతుక ధరల్లో ప్రభుత్వం నుంచి ఇసుక అందడం లేదు. ఇసుక కావాలంటే దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులే చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఇసుకదందా జోరుగా సాగుతోంది. టాస్క్ ఫోర్స్ బృందాలతో చర్యలు తీసుకుంటున్నామని అటు పోలీసులు, ఇటు రెవెన్యూ అధికారులు చెబుతున్నా ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటం లేదు. వాగుల్లో నీరు ఖాళీ అయి ఇసుక పైకి తేలిందంటే చాలు, నిలువునా దోచుకుని సొమ్ముచేసుకునేందుకు అక్రమార్కులు సిద్ధమై పోతున్నారు. ప్రజా ప్రతినిధుల, అధికారుల, పోలీసుల అండదండలు ఉండటంతో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. దహెగాం, పెంచికల్ పేట్ మండలలాలో మధ్య వారధిగా ఉన్న పెద్ద వాగు, కాగజ్ నగర్ పెద్ద వాగు బిడ్జి వాగులలో ఇసుక దోపిడికి అడ్డాగా మారుతున్నాయి. ఇసుకను తరలించేందుకు ఒకటో రెండో ట్రాక్టర్లకి అధికారుల నుంచి అనుమతులు తెచ్చుకుంటున్న కొందరు... ఆ పేరుతో రోజుకు పదుల ట్రిప్పులు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే ఒక్కో ట్రాక్టర్‌కి ధర స్థానికంగా మండలాలలో అమ్మకానికైతే రూ. 3వేల నుంచి రూ. 5వేలు తీసుకుంటూ ఇటుక బట్టి వద్ద ఇష్ట రాజ్యంగా ఇసుక క్వారీలు నిల్వ చేసుకుంటున్నారు. పల్లెలు, ఇతర పట్టణాలకైతే దూరాన్ని బట్టి వసూలు చేస్తున్నారు. అనుమతులు పొందిన ట్రాక్టర్‌ల ద్వారా ఇసుకను ఉదయం తొమ్మిదిన్నర గంటల నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకే రవాణా చేయాల్సి ఉంది. కానీ ఉదయం 7గంటల నుంచే రవాణా మొదలవుతోంది. ఎన్ని ట్రిప్పులు తీసుకెళ్తున్నారు, ఎక్కడికి చేరవేస్తున్నారన్న దానిపై అధికారుల నిఘా కరవైంది. దీంతో అక్రమార్కులకు అడ్డే లేకుండా పోయింది. ఎలాంటి అనుమతులు లేకుండానే వాగుల్లో ట్రాక్టర్లతో ఇసుక తరలించడంతో మరోఎత్తు ఎదిగి సొమ్ము చేసుకుంటున్నారు. మండలాల్లోని ఉచ్చుమల్ల వాగు బొక్కి వాగు ఎర్ర వాగు పరివాహక ప్రాంతాల పలు వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణా యదేచ్ఛగా సాగుతోంది. రాత్రి వేళల్లో ట్రాక్టర్లతో ఇసుక రవాణా చేసి తెల్లారేసరికి ఏమి జరగనట్లే ఉండటం ఈ దందాలో నయా పంథా. ఎవరైనా అక్రమ రవాణాపై ఫిర్యాదు చేసినా అధికారులు, పోలీసులు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్ని వాగులపైనా నిఘా పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు అంటున్నారు.



### అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవు : తహసీల్దార్లు

ప్రభుత్వం తరుపున చాలాన్లు సమర్పించిన వారికే పర్మిషన్లు ఇస్తున్నాం. ఎక్కడైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవు అనిపెంచికల్‌పేట్, దహేగా తహసీల్దార్లు వెంకటేశ్వర్ రావు, కవిత తెలిపారు.

# గర్భిణీ మహిళలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి



### జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** మహిళలు ప్రెగ్నెన్సీ సమయంలో తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మంచి పౌష్టికాహారం తీసుకుంటూ చురుగ్గా ఉండాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరెట్ లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సామూహిక శ్రీమంతం, అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మనం ఆరోగ్యంగా ఉంటూ మంచి ఆహారం తీసుకుంటే మన బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటారనే అంశాన్ని మహిళలు గుర్తించుకోవాలని,మహిళలు ప్రెగ్నెన్సీసమయంలోఆనందంగా ఉండాలని, పౌష్టికాహారం తీసుకోవాలని , పాలు, పండ్లు, పప్పు ధాన్యాలు, గుడ్డు వంటి పోషక విలువలు గల ఆహారం సమృద్ధిగా తీసుకోవాలని, ప్రెగ్నెన్సీ సమయంలో మహిళలు చురుగ్గా ఉండాలని ప్రతి రోజు కొంత దూరం నడిచే అలవాటు చేసుకోవాలని, మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలని,డాక్టర్లు, ఆశా కార్యకర్తలు సూచించే వ్యాయామాలు తప్పనిసరిగా చేయాలని కోరారు. మనం ఆరోగ్యవంతంగా ఉంటూ డాక్టర్లు సూచించేవ్యాయామాలు చేస్తే మనకు ప్రసవం సాధారణంగా సులభంగా పూర్తవుతుందని, మన ఇంట్లో పెద్దమ్మలకు, అమ్మలకు సాధారణ ప్రసవం జరిగిందని, సాధారణ ప్రసవాల వల్ల అనేక లాభాలు ఉంటాయని, సాధారణ ప్రసవాలతో మహిళలు త్వరగా కోలుకుంటారని , బిడ్డల ఆరోగ్యానికి సాధారణ ప్రసవాలు మేలు చేస్తాయని, సిజేరియన్ ఆపరేషన్ల జోలికి వెళ్ళవద్దని కలెక్టర్ తెలిపారు.అనంతరం పోషణ్ పక్వాడ పక్షం సందర్భంగా అంగన్వాడీ సిబ్బందిచే చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాల స్టాల్‌ను సందర్శించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ. డాక్టర్ పి.కృపా బాయి, సి.డి.పి.ఓ. కవిత, అంగన్వాడీ సూపర్వైజర్ లు, టీచర్ లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# భక్తజన సంద్రమైన ధర్మపురి క్షేత్రం



**ప్రజాపక్షం/ధర్మపురి :** ప్రాచీన పుణ్యక్షేత్రం గోదావరి తీర పవిత్ర స్థలమైన జగిత్యాల జిల్లా ధర్మపురి క్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామివారల బ్రహ్మోత్సవాలలో పాల్గొనేందుకు వచ్చిన భక్తులతో శుక్రవారం ధర్మపురి క్షేత్రం భక్తజన సంద్రమైంది. గురువారం రాత్రి జరిగిన స్వామివారల కళ్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు రాత్రి స్వామివారి సన్నిధిలో సేద తీరడం సాంప్రదాయం. శుక్రవారం తెల్లవారుజాము నుండే భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించి స్థానిక దైవ దర్శనానికై దేవస్థానం ముందు బారులు తీరారు. పోటెత్తిన భక్తుల తాకిడితో అర కిలోమీటర్ వరకు క్యూలైన్ ఏర్పడింది. దేవస్థాన సిబ్బంది, పోలీసులు క్రమ పద్ధతిలో దర్శనానికి వీలు కల్పించారు. ముఖ్యంగా నిజామాబాద్, ఆర్మూర్, నిర్మల్, బాల్కొండ ప్రాంత భక్తులు తడి బట్ట స్నానాలయ్యో నర్సయ్య.. నీ గుల్లో పూజలయ్యో నర్సయ్య.. చంకన పిల్లాలయో నర్సయ్య... నెత్తిమీద ముల్లలివిగో నర్సయ్య... గండి దాటి మేమోస్తిమో నర్సయ్య.. గట్టెక్కి మమ్ముదోలవో నర్సయ్య.. అంటూ జానపద బాణీలో భగవాన్ నామ స్మరణలతో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు తెల్లవారుజామునే వేదమంత్రాల మధ్య మంగళవాయిద్యాలతో దేవస్థానం నుండి గోదావరి వెళ్లి పవిత్ర నదీ జలాలను తీసుకువచ్చి దేవాలయంలోని మూలవిరాట్లను అభిషేకించారు. ప్రధానాలయమైన శ్రీ యోగానంద స్వామి దేవాలయంతో పాటు అనుబంధ ఆలయాలలో అర్చనలు, పంచోపనిషత్ పూజలు, అభిషేకాలు, నిత్య కళ్యాణం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు గోదావరి తీరంలోని ఇసుక తిన్నెలపై చిన్న చిన్న గుడారాలు వేసుకుని భక్తి గీతాలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ రాత్రంతా గడిపారు. ఉదయం పూట పవిత్ర గోదావరి నదిలో స్నానాలు చేసి గోదావరి పురోహితులతో సంకల్పాలు చెప్పించుకున్నారు.



### అన్నదానానికి విశేష స్పందన

భక్తులు, యాత్రికుల సౌకర్యార్థం దేవస్థానం ఆధ్వర్యంలో భక్తుల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ఉచిత అన్నదాన కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుంది. అన్నదాన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు.

### ఆకట్టుకున్న హరికథా కాలక్షేపం

దేవస్థానం ఆవరణలోని శేషప్ప కళావేదికపై నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా గురువారం అర్ధరాత్రి వరకు సాగిన ఎస్‌వి శ్రీరాం భట్టార్ భాగవతార్ హరికథా కాలక్షేపం భక్తులను కట్టి పడేసింది. ఈ కార్యక్రమానికి భారీగా భక్తులు హాజరయ్యారు.



# ముగిసిన నామినేషన్స్ ఉపసంహరణ

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : కరీంనగర్ బార్ అసోసియేషన్‌కు ఈ నెల 28న జరగబోయే పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ముగిసింది. అనంతరం పోటీ చేసే న్యాయవాదుల జాబితాను ఎన్నికల అధికారి కాసుగంటి మాధవరావు విడుదల చేశారు. అధ్యక్ష పదవికి నాగరాజు లింగంపల్లి, రాజారెడ్డి లెంకల, రాములు పురెల్ల, సత్యనారాయణరావు జూపల్లి, వెంకటరాజ్ కుమార్ పోలు, ఉపాధ్యక్ష పదవికి రఘువీర్ తిరుకోవెల, శ్రీనివాస్ పటేల్ వేముల, శ్రీనివాస్ రావు పెంచల, సయ్యద్ సాబిర్, జనరల్ సెక్రటరీ పదవికి భూమాచారి చెల్లోజు, మహేందర్ రెడ్డి బేతి, ప్రదీప్ కుమార్ రాజ్, చతరాజ్, కార్యదర్శి పదవికి బీమా గుగులోతు, ప్రసాద్ నరేందుల రామగిరి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ పదవికి రవి మాడిపల్లి, లైబ్రరీ సెక్రటరీ పదవికి రాజేందర్ కటకం, తేజదీప్ రెడ్డి కోమటిరెడ్డి, లేడీ రిప్రజెంటేటివ్ పదవికి హేమలత, పటేల్ మొరాయ్, రేణుక డి, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ మూడు పదవులకు ఏడుగురు, జూనియర్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్ మూడు పదవులకు ఆరుగురు అభ్యర్థులు పోటీ చేస్తున్నారని తెలిపారు.

నామినేషన్ల పరిశీలనలో లేడీ రిప్రజెంటేటివ్ పోస్టుకు సతీష్ గంట, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌కు పోటీ చేసిన చంద్రశేఖర్ మేరుగు ఇద్దరు డిస్‌క్వాలిఫై అయ్యారని, కార్యదర్శి పదవికి చంద్రమౌళి కొలిపాక, హేమలత పటేల్ మోరాయ్‌లు నామినేషన్ ఉపసంహరణలు చేసుకున్నారని, కోశాధికారి పదవికి , స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ పదవులకు ఒక్కరు చొప్పున నామినేషన్లు వచ్చాయని ఎన్నికల అధికారి మాధవరావు తెలిపారు.

## అయ్యప్ప స్వామి శోభాయాత్ర ప్రారంభం



ప్రజాపక్షం/జమ్మికుంట : జమ్మికుంట పట్టణ పరిధిలో అయ్యప్ప స్వామి 25వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక బొమ్మల గుడి విశ్వేశ్వర స్వామి దేవాలయం నుంచి అయ్యప్ప స్వామి ఆలయం వరకు జరిగే శోభాయాత్రను శుక్రవారం జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు ప్రారంభించారు. ఈ శోభాయాత్ర గాంధీ చౌక్ బస్టాండ్ పాత అంబేద్కర్ చౌక్ మీదుగా ప్రధాన వీదుల గుండా అయ్యప్ప స్వామి దేవాలయం వరకు అంగరంగ వైభవంగా కొనసాగింది. అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## ఎంపి అభ్యర్థి వంశీని కలిసిన కాంగ్రెస్ నాయకులు



ప్రజాపక్షం/కాసిపేట : పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గడ్డం వంశీని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ప్రకటించిన సందర్భంగా శుక్రవారం మండల అధ్యక్షులు రత్నం ప్రదీప్ మండల నాయకులతో ఎంపి అభ్యర్థి వంశీని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రత్నం ప్రదీప్ మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూ వంశీ గెలుపులో కీలక పాత్ర పోషిస్తామని పేర్కొన్నారు.

## గురుకుల ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించాలి

### టివియువి రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్

ప్రజాపక్షం/ మంచిర్యాల : మంచిర్యాల మైనార్టీ బాలికల గురుకుల ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించాలని టివియువి రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తా లోగల ప్రభుత్వ విశ్రాంతి భవనంలో తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక (టివియువి) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మైనార్టీ గురుకుల ప్రిన్సిపాల్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని, జిల్లా కేంద్రంలోని మైనార్టీ బాలికల గురుకుల ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం కారణంగానే ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని వహిదా చనిపోయిందని ఆరోపించారు. విద్యార్థి అనారోగ్యంగా ఉన్నా కూడా పట్టించుకోకుండా ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే విద్యార్థిని చనిపోయిందని, సరైన సమయంలో స్పందించి ఉంటే విద్యార్థి బంగారు భవిష్యత్తును కాపాడేవారని, అలా కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల విద్యార్థిని చనిపోయిందని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థి వహిద మృతికి కారణమైన ప్రిన్సిపాల్ ని తక్షణమే తొలగించాలని బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం 25 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ప్రకటించాలని తెలిపారు, లేనిపక్షంలో దశలవారీగా ఉద్యమాలు చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో హరీష్, సాయి కుమార్, రమేష్ నాయక్, గణేష్, సిద్ధార్థ, చందులు పాల్గొన్నారు

## నూతన విద్యావిధానం రద్దు చేయాలి

### కరీంనగర్‌ను విద్యాహబ్‌గా మార్చాలి



ప్రజాపక్షం/కరీంనగర్ప్రతినిధి : నూతన విద్యా విధానం 2020ని రద్దు చేయాలని, కరీంనగర్‌ను విద్యా హబ్‌గా మార్చాలనే డిమాండ్‌తో రూపొందించిన కరపత్రాన్ని శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక మంకమ్మతోటలోని జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యా వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ పూర్తిగా విద్యను పేద మధ్యతరగతి విద్యార్థులకు దూరం చేసే పరిస్థితి కనిపిస్తుందని వారు తెలిపారు. నూతన విద్యా విధానం 2020 తీసుకొచ్చి విద్యలో మతోన్మాదాన్ని, కులాన్ని చొప్పించే ప్రయత్నం చేస్తుందన్నారు. కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిగా గెలిచిన బండి సంజయ్ ఐదేళ్ల గడిచినా విద్యార్థుల పక్షాన పార్లమెంటులో మాట్లాడి కరీంనగర్‌కు ఒక ట్రిబుల్ ఐటి, ఒక నవోదయ, జిల్లా కేంద్రంలో శాతవాహన యూనివర్సిటీకి అధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను ఓడించాలని విద్యార్థులను, యువతీ, యువకులను కోరారు. బిజెపి పూర్తిగా మతోన్మాదాన్ని ప్రేరేపించే ప్రయత్నం దేశవ్యాప్తంగా చేస్తుందన్నారు. అదే విధంగా స్వాతంత్ర్యోద్యమంలో పోరాడి అమరులైన మహనీయుల చరిత్రను వక్రీకరిస్తూ చరిత్ర హీనులను పాఠ్యపుస్తకాల్లో చేరుస్తున్న పరిస్థితి కనిపిస్తుందన్నారు. శాస్త్రీయంగా నిరూపమైన మానవ మనుగడ చూపే డార్విన్ సిద్ధాంతాన్ని పాఠాన్ని తీసేసిన హీన చరిత్ర బిజెపి ప్రభుత్వానిదేనని, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను ఓడించాలని విద్యార్థి లోకాన్ని కోరారు. జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, జిల్లా సహాయ కార్యదర్శి వినయ్, నితిన్, అనిల్, కళ్యాణ్, మనోజ్ తదితరులున్నారు.

## కార్మికులపైన యాజమాన్యం నిర్లక్ష్యం వైఖరిని సహించేది లేదు



ప్రజాపక్షం/శ్రీరాంపూర్ : సింగరేణి సంస్థ మనుగడకు ఎల్లప్పుడు తమ శ్రమను అందిస్తూ తోడ్పడే కార్మికుల పైన యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని సహించేది లేదని ఐఎన్‌టియుసి శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షులు జెట్టి శంకర్ రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఆర్పి1 గనిలో గురువారం మొదటి షిఫ్ట్ లో జరిగిన ప్రమాదంలో సాదం సత్యనారాయణ అనే హ్యామర్ మెన్ కార్మికుడు తీవ్ర గాయాల పాలై తన రెండు కాళ్ళు కోల్పోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గనిలోని కార్మికులను కలిసి జరిగిన ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. యాజమాన్యం కార్మికుల రక్షణ పైన శ్రద్ధ చూపకపోవడం, మార్చి నెల ముగుస్తున్న తరుణంలో యాజమాన్యం పూర్తిగా ఉత్పత్తి పైన శ్రద్ధ చూపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రొడక్షన్ పై చూపుతున్న శ్రద్ధ, కార్మికుల రక్షణ విషయంలో చూపని అధికారుల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జరిగిన ప్రమాదానికి యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. బాధ్యతారహితంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఈ విషయమై ఉన్నతాధికారులతో చర్చిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ నాయకులు గరిగే స్వామి, కలవేణ శ్యామ్, ఏరియా సెక్రటరీలు వెంగల కుమారస్వామి, రావుల అనిల్, ఏరియా నాయకులు ఎంబడి తిరుపతి, నీలం సదయ్య, సతీష్, పిట్ సెక్రటరీ మద్యల వెంకటేష్, నాయకులు తిరుపతిరావు, కొట్టె వెంకటేష్, బాలాజీ, స్వామి, మైపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## అక్షయ మహిళా డిగ్రీ కళాశాల ఫేర్వెల్ పార్టీ సంబరాలు



ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ : అక్షయ మహిళా డిగ్రీ, పిజి కళాశాల ఫేర్వెల్ పార్టీ వేడుక సంబరాలు విద్వె సమారోహ్ 2024 శుక్రవారం స్థానిక ఆరెపల్లి రోడ్‌లోని ఇ.యన్ గార్డెన్‌లో ఘనంగా జరిగాయి. కళాశాల చైర్మన్ వి.రవీందర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి సభా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాశాల చైర్మన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్య అనేది ఒక ఆయుధం దీనిని వినియోగించుకోవాలని, ఉన్నత విద్య కోసం ప్రణాళికలను రూపొందించుకోవాలని, వ్యక్తిత్వ వికాసాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ప్రతి సంవత్సరంలాగే చాలా మంది విద్యార్థులు వివిధ కంపెనీలలో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శ్రీతేజ జాతీయ సాహస శిబిరంలో , ఉషశ్రీ నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో పాల్గొనడం కళాశాలకు గర్వకారణమన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, వివిధ రకాల పాటలతో సంబరాలు అంబరాన్నంటాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.శైలజ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులున్నారు.

## పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎంఎల్ఎ



ప్రజాపక్షం/బోథ్ : బోథ్ మండలం కౌఠ(బి) గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి ఆశీర్వాదాలు బోథ్ నియోజకవర్గ ప్రజల పై ఉండాలని, పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో బోథ్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలని అన్నారు. అనంతరం కన్గుట్ట గ్రామంలో శ్రీ శబరిమాత విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి తుల శ్రీనివాస్, జడ్పీటీసీ డాక్టర్ సంధ్యారాణి, మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ రుక్మణ్ సింగ్, సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గురుకులంలో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలి




ప్రజాపక్షం/బోథ్ : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 202425 సంవత్సరానికి గాను 6,7,8,9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల,కళాశాల బోథ్ ప్రిన్సిపల్ బి.ఎం. స్వర్ణలత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థినిలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 23వ తేదీ ఆఖరి తేదీ అని తెలిపారు.

## 31వరకు పూర్తిస్థాయిలో పన్నులు వసూలు చేయాలి

### మున్సిపల్ కమిషనర్ అయాజ్

ప్రజాపక్షం/జమ్మికుంట : జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి పన్నులు, ట్రేడ్ లైసెన్స్, నల్లా పన్నుల వసూళ్లు ఈ మార్చి 31 వరకు వంద శాతం వసూలు చేయాలని జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ మొహమ్మద్ అయాజ్ మంగళవారం అధికారులను ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ మేనేజర్ భూపాల్ రెడ్డి, ఆర్ఐ భాస్కర్ ఆధ్వర్యంలో హెల్త్ అసిస్టెంట్, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లతో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు 84 శాతం వసూళ్లు పూర్తి చేశారని, మిగిలిన మొత్తం త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని మున్సిపాలిటీలతో పోలిస్తే జమ్మికుంట మున్సిపాలిటీ ముందుండాలన్నారు. ఈ నెల 31 వరకు ఉన్న 90 శాతం రిబేట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో మహేష్, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

## యుబిఐ బ్యాంకు ఆధ్వర్యంలో మెగాబ్యాంకుకు విశేష స్పందన

ప్రజాపక్షం/జమ్మికుంట : జమ్మికుంట యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బ్యాంకు ఆవరణలో శుక్రవారం రెండవ రోజు నిర్వహించిన మెగా క్యాంపుకు విశేష స్పందన లభించింది. బ్యాంకులో ఖాతాలేని 110 మందికి జీరో బ్యాలెన్స్ ఖాతా తెరిచారు. 70 మందికి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన 15 మందికి ప్రధానమంత్రి జీవన జ్యోతి, బీమా యోజన 20 మందికి, అటల్ పెన్షన్ యోజన స్కీం కింద 20 మందికి నమోదు చేసినట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. బ్యాంకు మేనేజర్ దొరస్వామి నాయక్, రీజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నితీష్, గ్రామ తరంగ్ కరీంనగర్ ఏరియా మేనేజర్ కిరణ్, బ్యాంక్ మిత్రలు సమ్మెట అచ్యుత్, ఈర్ల రమేష్, మమత, స్వరూప, దివ్య తదితరులున్నారు.

## మద్యం దుకాణాలపై ఫిర్యాదు



**ప్రజాపక్షం/చింతలమానేపల్లి/పెంచికల్‌పేట్‌:** సిర్పూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో మద్యం వ్యాపారుల దోపిడీకి అంతులేకుండా పోతుంది. చింతలమానేపెల్లి మండలం గూడెం గ్రామంలోని మద్యం దుకాణంలో సాక్షాత్తు ఎక్సైజ్ సిఐ జాన్ శామ్యూల్ ముందు స్పీకర్ ఆన్ చేసి మద్యం దుకాణం దారునికి ఫోన్ చేసి 2 లీటర్ మద్యం బాటిల్ ధర అడిగితే రూ. 300 అధికంగా చెప్పడం వారి దోపిడీని నిరూపిస్తోంది. దీంతో శుక్రవారం కాగజ్‌నగర్ ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

## ఉమెన్ అచీవర్స్ అవార్డు గ్రహీతకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/మంచిర్యాల :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వంచే ఉమెన్ అచీవర్స్ 2024 అవార్డు అందుకున్న మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎసిసి 3 అంగన్ వాడీ టీచర్ ఎన్. పద్మను శుక్రవారం యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఘనంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు పెండ్లి అంజయ్య యాదవ్ మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రం ద్వారా ఉత్తమ సేవలు అందిస్తున్న టీచర్ పద్మకు ప్రభుత్వ పురస్కారం రావడం హర్షణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ హక్కుల పోరాట సమితి పట్టణ అధ్యక్షుడు పర్శ రాజన్న యాదవ్, నాయకులు మహేష్ యాదవ్, పాల్గొన్నారు.

## విద్యార్థులు పరీక్షల్లో ఉన్నత మార్కులు సాధించాలి



**ప్రజాపక్షం/ కాగజ్ నగర్ :** పదవ తరగతి విద్యార్థులు శ్రద్ధతో చదివి వార్షిక పరీక్షల్లో టెన్ జిపిఎ సాధించాలని ఆర్‌సిఒ గోపీచంద్ నాయక్ సూచించారు. శుక్రవారం కాగజ్ నగర్ పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ఇప్పటి రాసిన పరీక్షల్లో ఎలాంటి మార్కులు సాధించే అవకాశం ఉందని విద్యార్థులరను అడిగి తెలుసుకున్నారు. రాబోయే మ్యాథ్స్, సైన్స్, సోషల్ పరీక్షల్లో కూడా శ్రద్ధగా చదివి టెన్ జిపిఎ సాధించాలని, ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం విద్యను అందించడానికి కోట్ల రూపాయలను ఖర్చు పెడుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి విద్యను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో రాణించాలన్నారు. విద్య నేర్పిన గురువులతో పాటు పాఠశాలకు కూడా మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మంగా, ఉపాధ్యాయులు నంద, ఫాజియా, దుర్గం ఆనందరావు, పిఇటి సురేష్‌లు పాల్గొన్నారు.

# ఏడాది దాటినా పూర్తి కాని రోడ్డు నిర్మాణం

### దుమ్ముతో నిత్య ప్రయాణం నరకం..



**ప్రజాపక్షం/పెంచికల్ పేట్ :** పెంచికల్ పేట్ నుంచి లగ్గమా మెయిన్ రోడ్డు వరకు చేపట్టిన రెండూ వరుసల రోడ్డు పనులు ఏడాది దాటిన పూర్తికావడం లేదు. దాదాపు 4 కిలోమీటర్ల దూరం పనులు చేపట్టారు. అయితే ఈ రహదారిలో కంకర రోడ్డు వేసిన ఇప్పటి వరకు తారురోడ్డు వేయలేదు. ఇప్పటికీ ఈ పనులు కొనసాగుతూనే ఉండటంతో ఆ రోడ్డులో విపరీతంగా దుమ్ము లేస్తోంది. అయితే దుమ్ము లేవకుండా ఉండేందుకు గాను కాంట్రాక్టర్ కంకర రోడ్డుపై నీటిని సైతం చల్లడం లేదు. దీంతో స్థానిక ప్రజలు దుమ్ముతో ప్రయాణించే సమయంలో ప్రమాదం జరిగే అవకాశం ఉందని భయ భ్రాంతులకు గురవుతున్నారు. ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తున్న వారికి రోడ్డుపై వస్తున్న దుమ్ము కండ్లలో చేరడంతో నానాఇబ్బందులు పడుతున్న కాంట్రాక్టర్, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. లారీలు, కార్లు, ట్రాక్టర్లు, డిసిఎం వ్యాన్లు ఈ రోడ్డుపై వెళ్తున్నపుడు దట్టమైన పొగలను తలపించేలా దుమ్ము లేవడంతో ఆ ప్రాంతంలో ప్రయాణిస్తున్న వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా రోడ్డుకు ఇరువైపులా ఉన్న పంట చేన్లపై మొత్తం దుమ్ము చేరుతోంది. దీంతో దిగుబడి కూడా సరిగా రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. నిత్యం ఇదే మార్గంలో వందలాది వాహనాలు నడుస్తుండటంతో ఈ రోడ్డుపై కాలినడకన, సైకిళ్లపై, ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తున్న వాహనదారుల ఇబ్బందులు గుర్తించి ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి తారు రోడ్డు పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## బాసరలో భూకబ్జాదారుల హల్‌చల్..



**ప్రజాపక్షం/బాసర :** బాసర శివారు పరిధిలోని శారదా నగర్ కాలనీ లో సర్వే నెంబర్ 503/4 లో గల 23 గుంటల భూమి పై భూకబ్జా దేగల కన్ను పడింది..23 గుంటలలో అనుమతి తో 9 ప్లాట్ లు చేసి అమ్మకానికి పెడితే దౌర్జన్యం చేస్తున్నారని జంగం లావణ్య అన్నారు. నాలా పర్మిషన్, సర్వేయర్ ఇచ్చిన లొకేషన్ మ్యాప్ ఉన్నారు నిజామాబాద్ కు చెందిన ఆనంద్ సోమాని అనే వ్యక్తి సదురు మహిళ అన్ని కూడా చూడకుండా బూతుపురాణం తిడుతూ, రాత్రి పూట తాగిన మైకంలో సుమారు పదిమంది కిరాయి మనుషులని,తన అనుచరులను తెప్పించి తన పై దాడి చేశారని బాసర కు చెందిన జంగం లావణ్య ఆరోపించారు.బాసర పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. 2022లో భూమి కొనుగోలు చేసి అమ్మివేశానని తన పేరుపై పట్టా రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాగాని తమను వేధించి దాడులకు పాల్పడుతున్నారని తనకు న్యాయం చేయాలని,ఆనంద్ సోమాని అనుచరులతో నాకు ప్రాణహాని ఉందని నాపై దాడి చేసిన అనుచరుల పై చట్టరీత్యా క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆవేదన వ్యక్తపరచారు.

## డ్రోన్ల సహకారంతో పొలాలకు మందులు స్ప్రే

### ఖర్చులు, కూలీల బెడదను తగ్గిస్తున్న డ్రోన్



**ప్రజాపక్షం/ముత్తారం :** పంట పొలాల్లో రైతులు నిలబడి చల్లే మందులు, హ్యాండ్, తైవాన్ పంపుల ద్వారా స్ప్రే చేయడం మానేసి డ్రోన్లు ద్వారా తమ పంట పొలాలను పురుగుల మందులను స్ప్రే చేస్తూ తక్కువ ఖర్చుతో తమ పంట పొలాలను చీడపీడల భారీ నుండి కాపాడుకుంటున్నారు. తాజాగా పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు, ముత్తారం, అడవి శ్రీరాంపూర్ గ్రామాలతో పాటు తదితర గ్రామాల్లోని రైతులు డ్రోన్ల ద్వారా తమ పంట పొలాలకు పురుగుల మందులు స్ప్రే చేస్తూ చీడపీడల భారి నుండి తమ పంటలను కాపాడుకుంటున్నారు.రానున్న రోజుల్లో రైతన్నలందరూ డ్రోన్ల వైపే వెళ్తారన్నదానికి పక్కగా కనిపిస్తుంది. తమ పంట పొలాలకు ఈ రోజుల్లో కూలీల ఖర్చు ఆధారంగా పెరగడమే ప్రధాన కారణం, కూలీల ఖర్చు నుండి రైతులకు డ్రోన్లు ఎంతో మేలు చేస్తున్నాయని రైతులు పలువురు అభిప్రాయపడుతున్నారు. వృథా ఖర్చును నివారిస్తుందని, మందు వృధా కాకుండా తక్కువ సమయంలో పంట పొలాలకు మందు స్ప్రే చేయడంతో సమయం ఆదా అవుతుందని ఉన్నారు. ఐదు నుండి పదినిమిషాల్లోపే ఒక ఎకరం పొలానికి మందులు పిచికారీ చేయొచ్చని సకాలంలో చీడ పీడల నివారణ జరిగి దిగుబడి పెరుగుతుందన్నారు. అలాగే పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలో ఓగులవేన కుమార్ అనే రైతు డ్రోన్ల సహకారంతో పురుగు మందులను డ్రోన్ల ద్వారా పంట పొలాలకు మందులు పిచికారీ చేయించారు. దీంతో కూలీల ఖర్చు ,కూలీల బెడద నుండి తనకు తక్కువ సమయం లోనే పంట పొలానికి మందులు పిచికారి చేయడం జరిగిందని రైతు తెలిపారు.

## బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి ఆగని చేరికలు



### సిరిసిల్లలో కేటీఆర్ కు షాక్ ఇచ్చిన మున్సిపల్ కౌన్సిలర్లు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలువురు బిఆర్ఎస్ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కేటీఆర్ కు షాకిచ్చి హస్తం గూటికి చేరుతున్నారు. మొన్న బిఆర్ఎస్ 13వ వార్డు కౌన్సిలర్ శైలజ, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ నేరేళ్ల శ్రీకాంత్ గౌడ్ ఈరోజు బిఆర్ఎస్ కౌన్సిలర్లు కుడిక్యాల రవి, వేముల రవి, రెడ్డి నాయక్ లను శుక్రవారం సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గత ప్రభుత్వంలో వార్డులలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిచి అధికారంలోకి వస్తే పేద మహిళలకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందిస్తామని రాహుల్ ప్రకటించారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు కామని వనిత, నాయకులు గడ్డం నరసయ్య, మ్యాన ప్రసాద్, ఎల్లే లక్ష్మీనారాయణ, వెంకటరమణ, భూమేష్ పాల్గొన్నారు.

## అంబేద్కర్ కాలనీలో తాగునీటి ఇబ్బందులు

**ప్రజాపక్షం/పెంచికల్ పేట్ :** పెంచికల్ పేట్ మండలంలోని ఎల్లూరు గ్రామ పంచాయితీ పరిధిలో గల అంబేద్కర్ కాలనీ (ఎస్‌సి) వాడలో గత పది రోజులుగా త్రాగు నీటి కోసం ఉపయోగించే బోరింగ్ పనిచేయక పోవడంతో కాలనీ వాసులు త్రాగు నీటికి నానా అవస్థలు పడుతున్నారు. బోర్‌వెల్ పాడై తాగు నీరు లేక అవస్థలు పడుతున్నామని కాలనీ వాసులు అధికారుల దృష్టికి తీసుకెళ్తే కనీసం స్పందించడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైన సంబధిత ఉన్నతధికారులు స్పందించి బోరింగ్ మరమ్మత్తులు చేపించి త్రాగు నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

## బాసర మండల ప్రింట్ మీడియా కార్యవర్గం ఎన్నిక..

**ప్రజాపక్షం/బాసర :** నిర్మల్ జిల్లా బాసర ప్రింట్ మీడియా కార్యవర్గాన్ని శుక్రవారం ఆలయం వద్ద గల ఓ అతిథి గృహం లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షులుగా అంతగిరి మాధవ్, అధ్యక్షులుగా జాదవ్ దత్తు పటేల్, ఉప అధ్యక్షులు గా దావు రాజు,ప్రధానకార్యదర్శి గా అబ్బువార్ గౌతమ్, కోశాధికారి గా గురప్ప శంకర్,పీఆర్ఓ గా కారేగం సాయందర్,కమిటీ సలహాదారులు గా విజయ్ కుమార్, పవన్ కుమార్,సంతోష్ రావు,జంగం రమేష్,అచ్యుత్ రావు, సభ్యులు గా రాజేందర్,రామారావు,అనిల్,రవి,సంతోష్, అనిల్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

## సిడిపిఓ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/కడెం :** మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలైన గంగాపూర్,కుర్రతండా,రాణిగూడెం గ్రామా పంచాయతీ పరిధిలలో గల 7 అంగన్వాడి కేంద్రాలను శుక్రవారం సిడిపిఓ సరిత ఆకస్మికంగా తనిఖీలు చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులకు అందించే భోజనాన్ని,అంగన్వాడి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు,బాలింతలకు,కిశోర బాలికలకు అందించే పోషకాహారలను ఆయా అంగన్వాడి కేంద్రాల టీచర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి మెనూ ప్రకారం ప్రతి బెన్ఫిషర్ కు ఫుడ్ సప్లమెంటరీ సక్రమంగా అందించాలని అంగన్వాడి సిబ్బందికి ఆదేశించారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సహనాజ్ పర్వీన్ అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

## జరిగిన రోడు ప్రమాదంలో ఆసుపత్రి వైద్యులు మృతి.

**ప్రజాపక్షం/కడెం :** కడెం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రాజ్ కుమార్ మృతి చెందారు. వివరాల్లోకి వెలితే మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ గా వైద్య సేవలందిస్తున్న నిజామాబాద్ జిల్లా మెండోర మండలంలోని సవెల గ్రామానికి చెందిన రాజ్ కుమార్(32) భుక్తాపూర్ గ్రామ సమీపంలో గత రాత్రి 11 గంటలకు కార్ అదుపుతప్పి చెట్టును డికొన్న ఘటనలో అక్కడికక్కడే మృతి చెందినట్లు కడెం వైద్య సిబ్బంది తెలిపారు. ఆయన మరణం పట్ల ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

## మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



**ప్రజాపక్షం/ముత్తారం :** అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గురువారం తెల్లవారుజామున రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని పారుపల్లి గ్రామ సమీపంలోని మానేరు వాగు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తున్నారు. ఈక్రమంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టే చర్యలలో భాగంగా తాసిల్దార్ సుమన్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులకు గురువారం తెల్లవారుజామున మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టుబడ్డాయి. దీంతో ఆ ట్రాక్టర్లను ముత్తారం పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడిలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ముత్తారం తాసిల్దార్ సుమన్ హెచ్చరించారు.

## ప్రపంచ జల దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/కడెం :** మండలంలోని లింగపూర్ గ్రామంలో గల బిసి బాలుర వసతి గృహంలో బోరవెల్ రీచార్జ్ స్ట్రక్చర్ పనులను శుక్రవారం మధ్యాహ్నం 12గంటలకు డిఆర్ డిఓ పిడి విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి వర్షపు బొట్టు ఒడిసి పట్టి అనే నినదలు చేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ నీటిని పొదుపుగా వడుకోవలని వృదగ పోనియ్యవద్దని విద్యార్తులకు నీటి విలువల పై వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏ పి ఓ జయదేవ్, ఈసి కవిత,టిఎ కంతరావ్,ఎఫ్ ఏ జెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

## సాఫ్ట్ బాల్ పోటీలకు రైజింగ్ సన్ పాఠశాల విద్యార్థుల ఎంపిక

**ప్రజా పక్షం/పెద్దపల్లి టౌన్ :** మార్చి 13న గోదావరిఖని లోని డిగ్రీ మరియు పీజీ కళాశాలలో జిల్లా స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఈ నెల 22 మరియు 23వ తేదీన భువనగిరి జిల్లా, ఆలేరు ఇండోర్ క్రీడా ప్రాంగణంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు రైజింగ్ సన్ పాఠశాల విద్యార్థులు గడ్డం చంద్ర మహీధర్, శివ తరుణ్, వినయ్ ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు తగురం తిరుపతి తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సయీద్ అహ్మద్ మరియు ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## హరితహారాన్ని పెంపొందించేందుకు కృషి

**ప్రజాపక్షం/ సుల్తానాబాద్ :** రానున్న వర్షాకాలంలో హరితహారం పకడ్బందీగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు అన్నారు. శుక్రవారం హరితహారం కార్యక్రమం కోసం స్థానిక మార్కండేయ కాలనీ సమీపం లోని నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ హరితహారం ద్వారా సకాలంలో వర్షాలు కురుస్తాయని మొక్కలు మానవ జీవనావళికి ఆక్సిజన్ అందిస్తాయని అన్నారు. మొక్కల ద్వారా పచ్చటి వాతావరణం ఏర్పడి కాలనీలు పచ్చదనంతో శోభిలుతాయన్నారు, అనంతరం పెరుగుతున్న మొక్కలను పరిశీలించారు.

## ఘనంగా శాలివాహన జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ మండల కేంద్రంలో శాలివాహన జయంతి కార్యక్రమాన్ని పట్టణ కుమ్మర శాలివాహన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శాలివాహన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా జయంతి ఉత్సవాన్ని నిర్వహించారు.అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు టి.కె. శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు వాడు,కుమ్మర కులస్తుడు శాలివాహనుడు భారతదేశాన్ని పరిపాలించాడని అన్నారు. శాలివాహనుడు శకం భారత దేశంలో కొనసాగుతున్నదని అన్నారు. ప్రస్తుతం తెలుగు క్యాలెండర్ ప్రకారం శాలివాహన శకం కొనసాగుతున్నదని టీ. కే శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నల్లవెల్లి ప్రభాకర్ పట్టణ ప్రధాన కార్యదర్శి టి.కె. రమేష్,పట్టణ కుమ్మర సంఘం నాయకులు టి.కె,సత్యనారాయణ, నాంపల్లి రవీందర్, విజ్జగిరి తిరుపతి, టీ.కే సతీష్, విజ్జగిరి సంజీవ్, వెంకటేష్ పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ వేణుగోపాలస్వామి చక్ర తీర్థ స్నానం వేడుకలు..



### పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు

### ముగిసిన బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం/ సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీ సంతాన వేణుగోపాలస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ వేణుగోపాలస్వామి చక్ర తీర్థ స్నానం అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా జరిగింది. శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయం నుండి రథయాత్ర గుడిమిట్టపల్లి శివాలయం వరకు ఊరేగింపుగా చేరుకుంది, అక్కడ స్వామివారికి చక్రస్నానం అనంతరం వసంతోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఒకరికొకరు పసుపు పూసుకొని పలు భక్తి పాటలపై చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అలాగే దేవాలయంలో ఉదయం నుండి సాయంత్రం వరకు పుష్ప యాగం, హోమాలు, గ్రామ బలి తో పాటు స్వామివారి ఉయ్యాల సేవ... పలు పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి, ఆలయ చైర్మన్ పల్ల మురళి సదాలక్ష్మి , పూజారి సావిత్రి శ్రావణ్ కుమార్ హరిణి లా ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు బ్రహ్మోత్సవాల వేడుకలు కనుల పండుగ గా ఘనంగా జరిగాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మాజీ సర్పంచ్ అంతటి పుష్పలత అన్నయ్య గౌడ్ దంపతులు, స్థానిక కిరాణా వర్తక సంఘం వారు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు, శుక్రవారంతో బ్రహ్మోత్సవాలు ముగిసాయి.. ఈ కార్యక్రమంలో పూజారులు రఘునంద చారి, సౌమిత్రి వేణు మాధవాచార్యులు,చంద్రశేఖర్ శర్మ ,రాకేష్ చారి, గోపాల చారి, ఆరుట్ల రంగాచార్యులు, పారువెల్ల సంతోష్ శర్మ , వల్ల కొండ మహేష్ , రమేష్ , పోలాస అశోక్ తో పాటు పలువురు పూజారులు పాల్గొని ఈ బ్రహ్మోత్సవాల వేడుకలను ఘనంగా నిర్వహించారు.

### యాగశాలను నిర్మించిన రామ్మూర్తి దంపతులకు ఘనంగా సన్మానం



సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీ సంతాన వేణుగోపాలస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు కొమురవెల్లి రామ్మూర్తి తన సొంత డబ్బులు (2,21,000) రెండు లక్షల ఇరవై ఒక వేల రూపాయలతో యాగశాలను నిర్మించారు, దేవాలయంలో శాశ్వతంగా ఉండేలా యాగశాలను నిర్మించినందుకు గాను ఆలయ చైర్మన్ పల్ల మురళీధర్ సదాలక్ష్మి దంపతులు, పూజారి సౌమిత్రి శ్రావణ్ కుమార్ హరిణి దంపతులు యాగశాల నిర్మాణ దాత... కొమురవెల్లి రామ్మూర్తి సత్తెమ్మ దంపతులను శాలువా కప్పి శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామ్మూర్తి నీ ఆర్యవైశ్య సంఘం నాయకులు అభినందించారు.

## పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిత్వంపై కాంగ్రెస్ పునరాలోచన చేయాలి




### మాదిగలను విస్మరిస్తే తిరుగుబాటు చేస్తాం.

### దళిత ఐక్య వేదిక నాయకుల హెచ్చరిక

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుండి కాంగ్రెస్ అభ్యర్థిత్వంపై అధిష్టానం పునరాలోచన చేయాలని దళిత ఐక్య వేదిక పెద్దపల్లి పార్లమెంట్ ఇంచార్జి మామిడిపల్లి బాపయ్య, మాదిగ శక్తి వ్యవస్థాపకులు, తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి సురేందర్ సన్నీ, నాయకులు కోటగిరి పాపయ్య డిమాండ్ చేశారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 80 లక్షలు, పెద్దపల్లి పార్లమెంట్ పరిదిలో 3 లక్షల మంది మాదిగలున్నారని అన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ ఎస్సీ రిజర్వు స్థానంలో ధనికులు, వ్యాపారులు వెంకట స్వామి కుటుంభానికి టికెట్లు ఇవ్వడం సరికాదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా మాదిగలు కాంగ్రెస్ కు అండగా నిలిచి గెలుపులో కీలక పాత్ర పోషించిన మాదిగలను విస్మరిస్తే తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ అధిష్టానం వంశీ అభ్యర్థిని మార్చి మాదిగలకు టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాదిగలకు టికెట్ ఇవ్వకుంటే త్వరలో రౌండ్ టేండ్ సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. తామంతా మాదిగ అభ్యర్థిని స్వతంత్రంగా పెద్దపల్లి పార్లమెంట్ బరిలో నిలుపుతామని ప్రజలంతా ఆశీర్విదించాలని కోరారు. సమావేశంలో కల్లెపల్లి రవి, తాళ్లపల్లి అంజయ్య, కుమ్మరి శ్రీశైలం, మోదుంపల్లి సందీప్, సందీప్, రాజేందర్, భూమయ్య పాల్గొన్నారు.

## దాడి చేసిన వక్తిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి మండలం అందుగులపల్లికి చెందిన రైల్వే ఉద్యోగి దొమ్మటి సదిపై దాడి చేసిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య, మాదిగ ఐక్య వేదిక నాయకులు కోటగిరి పాపయ్య డిమాండ్ చేశారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న దాడులను అధికారులు అరికట్టాలని కోరారు. సది జరిగిన దాడిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. సడిపై దాడి చేసిన సారయ్య అతని అనుచరులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలని కోరారు.

## లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



**ప్రజాపక్షం/లోకేశ్వరం :** మండలంలోని బాగాపూర్ గ్రామంలోని రాజ్యలక్ష్మి సమేత లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు మూడు రోజులపాటు కొనసాగుతాయని ఆలయ అర్చకులు సంతోష్, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ఆలయ అభివృద్ధి కమిటీ గ్రామ పెద్దలు తెలియజేశారు. నాలం సంతోస్ మాట్లాడుతూ లక్ష్మీనారాయణ స్వామి వారోత్సవాలు మూడు రోజుల పాటు జరుగుతాయని మొదటి రోజు గణపతి గౌరీ పూజ అఖండ దీపారాధన గోపూజ తులసి పూజ భద్ర మండల పూజా అగ్ని ప్రతిష్ట హోమం నిర్వహించడం జరిగిందని తెలియజేస్తూ భక్తులు స్వామి వారి సేవలో పాల్గొని స్వామి వారి కృప కటాక్షములు పొందాలని తెలియజేశారు.

## కొండలు గుట్టలు మాయమైపోయే వరకు నిద్ర లేవని మైనింగ్ అధికారులు



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్లప్రతినిధి :** జిల్లా అగ్రహారం నంది కమాన్ దగ్గర లోని గుట్టల పైన అక్రమంగా మట్టిని తరలిస్తున్న మైనింగ్ మాఫియా ఎలాంటి పరిమిషన్ తీసుకోకుండా పట్ట పగలే దర్జాగా జెసిబి తోని టిప్పర్లలో మట్టిని నింపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా మైనింగ్ అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో కూడా మైనింగ్ అధికారులకు విన్నవించుకున్నా గాని నామమాత్రంగా చర్యలు తీసుకుంటూ, మైనింగ్ మాఫియా వాళ్లను వదిలిపెట్టడంతో అడ్డు అదుపు లేకుండా అక్రమ మట్టి రవాణా మూడు జెసిబి లు 30 టిప్పర్లతో మూడు పూలు ఆరుకాయలుగా కొనసాగుతుంది. ఇప్పటికైనా మైనింగ్ అధికారులు నిద్రమత్తును వీడి సకాలంలో స్పందించి మట్టి మాపియ్య పై చర్యలు తీసుకొని గుట్టలను కాపాడవలసిందిగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

## హెల్మెట్, సీట్ బెల్ట్ లేకుండా, మద్యం సేవించి, నిర్లక్ష్యంగా వాహనాలు నడుపవద్దు

**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల ప్రతినిధి :** సిరిసిల్ల పట్టణంలో ట్రాఫిక్ ఎస్.ఐ రమేష్ వాహనదారులకు , హెల్మెట్ డ్రైవింగ్, రాంగ్ రూట్, ర్యాష్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే అనార్దల పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్.ఐ రమేష్ మాట్లాడారు. ప్రజలు రోడ్ భద్రత, ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ వాహనాలు నడపాలని, వాహనం నడిపే సమయంలో హెల్మెట్, సిట్ బెల్ట్ తప్పని సరిగా ధరించాలని, ప్రాణం ఎంతో విలువైనది అని మన మీద మన కుటుంబ సభ్యులు ఆధార పడి ఉంటారని మద్యం సేవించి, నిర్లక్ష్యంగా, ర్యాష్ డ్రైవింగ్, రాంగ్ రూట్ లో, అవగాహన రహిత్యంలో వాహనాలు నదువుతు ప్రాణాల మీద తెచుకోవద్దని అన్నారు. ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, మైనర్ డ్రైవింగ్ చేయడం నేరం అని ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వరాదు అని తెలిపారు.ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ వాహనాలు నడపాలని కోరారు.

## బిఆర్ఎస్‌కు ఆదరణ తగ్గుతోంది..

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట : తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు ఆదరణ తగ్గుతోందని కాంగ్రెస్‌లో చేరిన గొల్లకుర్మ ఉమ్మడి నాయకులు మెండె శ్రీనివాస్ అన్నారు.శుక్రవారం వారు ఎల్లారెడ్డిపేట,వీర్నపల్లి మండలలా గొల్లకుర్మ నాయకులు ఎల్లారెడ్డిపేట కాంగ్రెస్ కార్యాలయం వద్ద రాజన్నసిరిసిల్లా కాంగ్రెస్ ఇంచార్జీ కేకేమహేందర్‌రెడ్డి సమక్షంలో చేరి కాంగ్రెస్ కండువా కప్పివారికి పార్టీలోకి ఆహ్వానించారు.కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ మండలద్యక్షులు దొమ్మాటనర్సయ్య,సద్దిలక్ష్మారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని అందుకే బీఆర్ఎస్‌ను ఎవరు నమ్మేపరిస్థితి లేదన్నారు.కార్యకర్తలకు సైతం అందులో తగిన గుర్తింపు లేకుడాపోయిందని విమర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌లో చేరిన కార్యకర్తలు కేకేకు దన్యవాదాలు తెలిపారు. వారి వెంట మందాటి దేవెందర్ యాదవ్ ఉన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో పోషణ అభియాన్ కార్యక్రమం

**ప్రజాపక్షం/కోనరావుపేట :** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలోని అంగన్వాడీ రెండవ సెంటర్‌లో పోషణ అభియాన్‌లో భాగంగా అంగన్వాడీ కార్యకర్త నర్మద ఆధ్వర్యంలో పోషణ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భవతులకు సీమంతాలు, ఆరు నెలల నిండిన పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం చేశారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ గంగాలక్ష్మి , గర్భవతులకు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించడం రక్తహీనత కొరకు ఎలాంటి పోషకాహారం తీసుకోవాలో కూరగాయలు, ఆకుకూరలు, క్యారెట్, బీట్ రూట్, పాలు, కోడిగ్రుడ్లు తీసుకోవాలని వివరించి చెప్పారు. చిరుధాన్యాల గురంచి, కొర్రలు, సామలు, ఊదలు, రాగులు, జొన్నలు, దీంట్లో లభించే పోషకాల గురించి తెలియజేశారు. పెరటి తోటల పెంపకం, పోషణ్ పక్వాడ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ గంగాలక్ష్మి , డి హబ్ జనరల్ స్పెషలిస్ట్ దేవిక, డిహబ్ ఫినాన్సియల్ లిటరసీ రమ్య, సరిత, అంగన్వాటీ టీచర్లు నర్మద, అరుణ, గర్భవతులు, బాలింతలు, పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు వినియోగించుకోవాలి

✻ తహసీల్దార్ ప్రసాద్.

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** ఓటు హక్కును ప్రతి ఒక్కరు నిర్భయంగా వినియోగించుకోవాలని ఇబ్రహీంపట్నం తహశీల్దార్ ప్రసాద్ అన్నారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇబ్రహీం పట్నం మండల కేంద్రంలో ఓటు హక్కుపై ర్యాలీని నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఓటు శాతాన్ని పెంచాలని తహశీల్దార్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ గంగాధర్, సీనియర్ అసిస్టెంట్ అనురాధ, కంప్యూటర్ ఆపరేటర్ నరేష్, ఉపాధ్యాయులు చిన్నయ్య, రాజన్న పాల్గొన్నారు.

# సంఘ భవన ప్రారంభోత్సవం...

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** జగిత్యాల పట్టణంలోని భవాని నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం జరిగే నూతన సంఘ భవన ప్రారంభోత్సవానికి జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతిలక్ష్మణ్ లను కలిసి ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భవాని నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు తాటిపర్తి మాధవరెడ్డి. ప్రధాన కార్యదర్శి అంబాజీ నాయక్ , ప్రధాన కార్యదర్శి వోడ్నాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** ప్రతిమ ఫౌండేషన్, జిఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆద్వర్యంలో ఉచితంగా అందించే ఉపాధి శిక్షణ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రతిమ ఫౌండేషన్ ఆర్గనైజర్ పడకంటి వర్ధిని అన్నారు. శ్రీ సందర్భంగా చిట్టాపూర్ గ్రామంలో ఉద్యోగ ఉపాధ్యాయ అవకాశాల కోసం రుపొందించిన కరపత్రములను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంప్యూటర్ శిక్షణ వ్యక్తిత్వ వికాస తరగతులు టైలరింగ్ ఎంబ్రాయిడరీ ఎలక్ట్రికల్ లాంటి వాటిలో ఉచితంగా శిక్షణ ఇచ్చిన ఉపాధి కల్పించడం జరుగుతుందని అన్నారు. యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న యువత 9492501465 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విష్ణువర్ధన్, సత్యనారాయణ, అంగన్వాడీ టీచర్లు స్నేహలత, లావణ్య, స్వరూప, శ్రీదేవి, మహిళలు నిరుద్యోగులు పాల్గొన్నారు.

# వ్యవసాయ బావిలో పడి మహిళ మృతి



**ప్రజాపక్షం/ఇల్లందకుంట :** మండలంలోని పర్లపల్లి గ్రామానికి చెందిన జోరుక రమ(40) శుక్రవారం వ్యవసాయ బావిలో పడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గత మూడు నెలలుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నదని, గురువారం సీతంపేటలో మరిది కూతురు లగ్నపత్రిక కార్యక్రమానికి వచ్చి శుక్రవారం ఉదయం 7 గంటలకు పర్లపల్లికి వెళ్లిపోయింది. సుమారు మధ్యాహ్నం 1 గంటలకు సీతంపేట గ్రామానికి చెందిన రహీం వ్యవసాయ బావిలో చనిపోయి ఉందని భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# చెక్‌పోస్ట్‌ల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** చెక్‌పోస్ట్‌ల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. లోకసభ సాధారణ ఎన్నికల సందర్భంగా సారంగాపూర్ మండలం చించోలి వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,పటిష్ట నిఘా చర్యలు చేపటి విస్తృత తనిఖీలు నిర్వహించాలని,నగదు,మద్యం రవాణాను నియంత్రించాలని అన్నారు.పోలీసు సిబ్బంది విధులు నిర్వహణ,ఎన్ని వాహనాలు తనిఖీ చేసింది అడిగి తెలుసుకున్నారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని,సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.వాహనాల తనిఖీ సంబంధించిన రిజిస్టర్‌లను నిర్వహించాలన్నారు. ప్రతి చెక్ పోస్ట్ లో వీడియోగ్రఫీ చేయాలన్నారు. అప్రమత్తంగా వుంటూ, 24 గంటల పటిష్ట నిఘా పెట్టాలని ఆయన అన్నారు. అనంతరం లోకేశ్వం మండల కేంద్రంలోని అంగన్వాడీ మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నది సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో స్టోర్స్ ను తనిఖీ చేసి సామాగ్రి నిలువను పరిశీలించారు.అంగన్వాడీ కేంద్ర నుండి ఇస్తున్న గుడ్ల నాణ్యతను పరిశీలించారు.అంగన్వాడీ కేంద్రం నుండి ఇస్తున్న గుడ్ల నాణ్యతను పరిశీలించారు.అగ్రిమెంట్ ప్రకారం గ్రుడ్ల బరువు వుండేలా చూడాలన్నారు. చిన్నారులకు,గర్భిణీలు,బాలింతలకు ప్రతిరోజు పౌష్టికాహారం అందించాలని సూచించారు.అలాగే ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు, ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.సూచించారు. అలాగే పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు.పోలింగ్ కేంద్రాల్లో త్రాగునీరు, విద్యుత్,టాయిలెట్ తదితర మౌళిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. మిషన్ భగీరథ నీటి సరఫరా లేనిచోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు అవసవమున్న చోట పెయింటింగ్ వేయాలని, టాయిలెట్లలో రన్నింగ్ వాటర్ ఉండాలన్నారు.భద్రతాపరంగా చర్యలు తీసుకోవాలని,కాంపౌండ్ వాల్ లేని పోలింగ్ కేంద్రాలకు వెంటనే కాంపౌండ్ వాల్ ఏర్పాట్లు చేయాలని ఆయన అన్నారు.భద్రత పరంగా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం లోకేశ్వరం మండలం పంచగుడి, నిజామాబాద్,నిర్మల్ అంతర్ జిల్లా చెక్ పోస్టులను కలెక్టర్ తనిఖీ చేసారు.పార్లమెంట్ ఎన్నికల నేపధ్యంలో జిల్లా అంతట పటిష్ట నిఘా పెంచాలని అధికారులను ఆదేశించారు.ప్రతి వాహనాన్ని తనిఖీలు నిర్వహిస్తూ రికార్డులు నమోదు చేయాలనీ సూచించారు.అనంతరం లోకేశ్వరం తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలను సందర్శించారు. సిబ్బంది నిర్వహిస్తున్న విధులను అడిగి తెలుసుకున్నారు.పెండింగధరణి దరఖాస్తులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు.మీసేవా ద్వారా ధ్రువీకరణ పత్రాలను సకాలంలో అందిచాలని ఆదేశించారు.కార్యాలయాల రికారులను పరిశీలించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేసారు. అనంతరం నర్సరీని సందర్శించి మొక్కల సంరక్షణకు ప్రతి రోజు నీరందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమాలలో నిర్మల్,బైంసా ఆర్.డి.ఓ.లు రత్నకల్యాణి,కోమల్ రెడ్డి, సారంగాపూర్,లోకేశ్వరం తహసీల్దార్లు శ్రీదేవి,మోతీరాం,ఎం.పి.డి.ఓ రామకృష్ణ, అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఈ నెలాఖరులోపు వంద శాతం పన్ను వసూలు పూర్తి చేయాలి

ఈ నెలాఖరులోపు వంద శాతం పన్ను వసూలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ,పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ,మార్చి 31 లోపు వందశాతం పన్ను వసూలుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇప్పటి వరకు జిల్లాలో 83 శాతం పన్ను వసూలు చేయడం జరిగిందని, మిగిలిన పన్ను వసూలును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.పంచాయతీ కార్యదర్శులు ఉదయం 8 గంటల లోపు గ్రామాల్లో పన్నుల వసూలు ప్రారంభించాలని ఆదేశించారు. ప్రత్యేక అధికారులు గ్రామపంచాయతీలను సందర్శించాలని,ఎండల తీవ్రత కారణంగా గ్రామాల్లో త్రాగునీటికి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.ఎండాకాలం స్పెషల్ డ్రైవ్ లో భాగంగా గ్రామాల్లోని పనిచేయకుండా ఉన్న బోర్ వెల్స్,చేతిపంపులకు మరమ్మత్తులు చేపట్టాలని అన్నారు.ఎండలు అధికంగా ఉన్నందున జనాల రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాలలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని,ఉపాధి హామీ సనులు జరిగే ప్రదేశాలలో కూలీలకు ఎండల తీవ్రత నుంచి రక్షణకు తాగునీటి సౌకర్య,టెంట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.రాబోయే రెండు నెలలు ఎండలు అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గ్రామాల్లో చెత్తను రోడ్ల పైన వేయకుండా నిరంతరం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని,నర్సరీలలో గ్రీన్ షెడ్ నెట్స్ తప్పనిసరిగి ఏర్పాటు చేయాలని సూచించారు.నిర్మాణంలో ఉన్న సిసి రోడ్లు,డ్రైనేజీల నిర్మాణాల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. ఎన్నికల కోడ్ ని ఖచ్చితంగా అమలు చేయాలని,రాజకీయ పార్టీల ప్రచారాలకు సంబంధించిన పోస్టర్లను.ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అనంతరం ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా పోస్టర్ లను కలెక్టర్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్,డి.ఆర్.డి.ఓ విజయలక్ష్మి ఆర్.డబ్ల్యూ.ఎస్.డి.ఈ సందీప్,తహశీల్దార్లు,ఎంపీవోలు,పంచాయతీ కార్యదర్శులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ సుడిగాలి పర్యటన



మండలంలోని కలెక్టర్ సుడిగాలి పర్యటన చేశారు లోకేశ్వరం ఉన్నత పాఠశాలలో అపరిశుభ్రపత పై అసహనం చేశారు అలాగే ఎన్నికల కోడ్ సందర్భంగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు తలే ఎత్తకుండా యూరినర్స్ గాని తదితర మరమ్మత్తులు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని తదితర అంశాలను తెలియజేశారు సిబ్బంది అంగన్వాడి పిల్లలకు ప్రభుత్వం ఖర్చు చేస్తుందని ఎంత ఖర్చు చేస్తుందని ఎంత ఖర్చు చేస్తుందో సిడిపివో అంగన్వాడీ సిబ్బందికి కలెక్టర్ అడగగా సమాధానం చెప్పలేకా పొగ విద్యార్థుల హాజరు పట్టికలో సమస్యలు ఉన్నందును ఆగ్రహం వ్యక్తం చేశారు అనంతరం పంచగుడి వద్ద ఏర్పాటుచేసిన అంతర్ జిల్లా చెక్ పోస్ట్ సందర్శించి అధికారులు అలెర్ట్‌గా ఉంగాలని ఎన్నికలు సజావుగా ముగిసేందుకు సహకరించాలని కోరారు. అనంతరం తాసిల్దార్ కార్యాలయానికి వెళ్లి ధరణి భూ సమస్యల పరిష్కరానికి చేపట్టిన చర్యలను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యనికి వెళ్లి ఆరు గ్యారెంటీ పథకాల అమలు పై సిబ్బందికి పలు సూచనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో బైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి తాసిల్దార్ మోతీ రాం,ఎంపీడీవో సల్మాన్ రాజు, ఐసిడిఎస్ సిడిపిఓ శ్రీమతి సూపర్వైజర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



జిల్లా ఎస్పీ జానకి షర్మి

**ప్రజాపక్షం/కుంటాల :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అన్నారు.శుక్రవారం కుంటాల మండలంలోని మహారాష్ట్ర సరిహద్దుల్లో గల దౌనెల్లి తాండ చెక్ పోస్టును ఆమె అకస్మికంగా తనికి చేశారు.ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు గుండా మద్యం అక్రమ డబ్బు,అసాంఘిక వ్యక్తులు జిల్లాలోకి ప్రవేశించకుండా నిరంతరం నిఘాను ఏర్పాటు చేసి పోలీసులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.అనంతరం కుంటాల పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు.సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఎస్సై రజినీకాంత్, ఏ ఎస్ ఐ దేవరావు,సిబ్బంది తదితరులు ఉన్నారు.

# గుండెపోటుతో భక్తుడు మృతి

**ప్రజాపక్షం/ధర్మపురి :** దైవ దర్శనం కోసం వచ్చిన భక్తుడు గుండెపోటుతో మృతి చెందిన సంఘటన జగిత్యాల జిల్లా ధర్మపురి క్షేత్రంలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ధర్మపురి ఎస్సై ఉదయ్ కుమార్ కథనం మేరకు నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలం నాగంపేటకు చెందిన రటపు నరహరి(55) ధర్మపురిలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో స్వామివారి దర్శనానికి కుటుంబ సభ్యులతో కలిసి గురువారం క్షేత్రానికి వచ్చాడు. గురువారం రాత్రి జరిగిన స్వామివారి కళ్యాణం తిలకించి రాత్రి గోదావరి నదీ తీరంలో మంగళి గడ్డ పుష్కర ఘాట్‌లపై నిద్రించాడు. గుండెపోటు రావడంతో నరహరి నిద్రలోనే చనిపోయినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు.

# ఆకస్మిక తనిఖీలు



**ప్రజాపోం/కోరుట్ల :** జగిత్యాల జిల్లా కోరుట్ల మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు కోరుట్ల పట్టణంలోని ప్లాస్టిక్ ఏజెన్సీలు, కిరాణా షాపులు, బేకరీలలో తనిఖీలు చేపట్టారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడుతున్న వారిపై జరిమానాలు విధించడంతో పాటు పరిశుభ్రతను తనిఖీ చేశారు. బట్ట సంచుల వాడకంపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ బట్టు తిరుపతి మాట్లాడుతూ సింగిల్ యూ ప్లాస్టిక్ నిషేదానికి దుకాణాదారులు సహకరించాలని రెస్టారెంట్లు, హోటల్స్, నాణ్యత ప్రమాణాలను పరిశుభ్రతను పాటించాలని కోరారు. లేని యెడల భారీ జరిమానాలు విధించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సానిటరి ఇన్స్‌ఫెక్టార్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ ఆకు అంయ్య , రమేష్, రాజు పాల్గొన్నారు.

# జలం లేనిదే జగతి లేదు...



**ప్రజాపక్షం/జగిత్యాలప్రతినిధి :** జలం లేనిదే జగతి లేదని, ప్రపంచ జల దినోత్సవ శుభకాంక్షలు తెలిపి జల రక్షణకు తోడుగా ఉండాలని గుర్తు చేస్తున్న అంబిటస్ జగిత్యాల ఇన్టర్నేషనల్ స్కూల్ చిన్నారులు...స్లోడన్స్‌తో మానవళికి నీటి ఆవశ్యకత ఎంతో ఉందని నీటిని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి భాధ్యత అని గుర్తు చేశారు. చిన్నారులు కలెక్టరేట్ ముందు ర్యాలీ నిర్వహించగా అందరిని ఆకట్టుకున్నాయి.